క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

పెరవలి: మండలంలోని కానూరు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. సబ్ స్టేషన్, విద్యుత్తు లైన్ల మరమ్మతుల కోసం ఈ సబ్ స్టేషన్ పరిధిలోని కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో సరఫరాను నిలిపివేస్తామన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు రూరల్: విద్యుత్తు లైన్ల నిర్వహణ నిమిత్తం పట్టణ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. గాంధీనగర్, జ్యోతి, ఎన్టీఆర్ కాలనీలు, సుబ్బరాజుపేట, సింగవరం, తీరుగూడెం ఏరియాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

శాకంబరిగా కుంకుళ్లమ్మ వారు



శాకంబరి అలంకారంలో కుంకుళ్లమ్మ వారు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారు ఫల, కూరగాయల అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఈ విశేష అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. డ్రాగన్ ఫ్రూట్స్, ఆపిల్, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్ వంటి ఫలాలతో పాటు, క్యారెట్, బంగాళ దుంపలు, క్యాప్సికం, వంకాయ, ఆనప, బీర వంటి కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయాన్ని సైతం శోభాయమానంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మహిళా భక్తులతో ఆలయం సందడిగా మారింది.

ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు అదృశ్యం



పాలపర్తి రోహాన్(ఫైల్)

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పాలపర్తి రోహాన్(రిక్కీ) అదృశ్యమయ్యాడు. ఎలక్ట్రీషియన్ పాలపర్తి శ్రీనివాస్ కుమారుడైన రోహాన్ 3వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు ఆడుకునేందుకు వెళ్లిన ఆ బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. దీనిపై తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై సుభానీ తెలిపారు.

అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

నల్లజర్ల: అక్టోబరు రెండో తేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో ఆటల పోటీలు ప్రారంభం అవుతాయని ఎంఈఓ వై.సత్యనారాయణ చెప్పారు. తొలుత గ్రామస్థాయిలో బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ తదితర పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల 17 ఏళ్ల పైబడిన యువకులు తమ గ్రామ సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామస్థాయి పోటీల్లో విజేతలకు తర్వాత దశలో మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. అక్కడ నుంచి డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ పోటీల నిర్వహణ కోసం ఇప్పటికే పీఈటీలు ఏ క్రీడ ఎక్కడ నిర్వహించాలనే అంశంపై చర్చించారన్నారు. ఎంపీడీఓ, చైర్మన్, తహసీల్దార్, ఎంఈఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీరాజ్ ఏఈ, మెడికల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటే కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి



మన్యం సూర్యనారాయణ



ఉప్పాటి వెంకటేష్

నిడదవోలు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పని చేసి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గురువారం నియమితులైన మాజీ ఎంపీపీ మన్యం సూర్యనారాయణ (సూరిబాబు) అన్నారు. జిల్లా నూతన కమిటీలో అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాలకు శుక్రవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సూరిబాబు స్వస్థలం మండలంలోని కలవచర్ల. కాగా కంసాలిపాలెంకు చెందిన ఉప్పాటి వెంకటేష్‌కు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులయ్యారు. వారిద్దరినీ వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య అభినందించారు.



తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు



విశేష పుష్పాలంకరణలో తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి అమ్మవారు



రూ.12 లక్షల కరెన్సీ నోట్లతో ఉండ్రాజవరం మండలం పాలంగి కనకదుర్గమ్మ అమ్మవారికి అలంకారం



గోపాలపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

సిరి, సౌభాగ్యాలు కలగాలని..

- శ్రావణ వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన మహిళలు
- అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల రద్దీ
- కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు రూరల్: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కొవ్వూరు డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు, హిందువుల లోగిళ్లు ఆధ్యాత్మిక శోభతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసంలో ఇంటి వద్ద లక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తే సిరి సంపదలు కలుగుతాయని ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు తమ ఇంట సిరులు పండించాలని, సకల సౌభాగ్యాలు ప్రసాదించమని అమ్మవారిని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. కోటసత్తెమ్మ, కాటకోటేశ్వరం శివాలయంలో ఉమాపార్వతీదేవిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. మహిళలు పగలంతా ఉపవాసం ఉండి నోములు నోచుకున్నారు. ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చి సత్కరించారు.

కళకళలాడిన అమ్మవారి ఆలయాలు

నిడదవోలు: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక చినకాశిరేవులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, రైల్వేస్టేషన్ రోడ్డులోని కనకదుర్గమ్మ , పట్టణ నడిబొడ్డున గల సంగాలమ్మ వారి పూరి గుడిని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంంకరించారు. ముందుగా ఇళ్ల వద్ద వరలక్ష్మీ పూజలు ఆచరించిన మహిళలు సాయంత్రం అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడాయి. కౌన్సిలర్ చిలకల శారదాదేవి ఇంటి వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఇక్కడి వాసవీమాత అమ్మవారిని 15 కాసుల బంగారంతో అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు.

తాళ్లపూడి: తమ ఇంట సిరులు కురిపించాలని, సౌభాగ్యం కలగజేయాలని కోరుతూ మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. వివిధ రకాల పిండి వంటలు, పూలు, పండ్లు, పత్రితో లక్ష్మీదేవిని పూజించారు. ఈ ఏడాది వివాహమైన కొత్త పెళ్లికూతుళ్లు, ముత్తైదువలు శ్రావణ శుక్రవారాన్ని ఆచరించారు. గోదావరి నదిలో స్నాన మాచరించి ఉదయం నుంచి ఉపవాసం ఉండి 12 రకాల పిండి వంటలను లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. ఇరుగు పొరుగు ముత్తైదువలను పిలిచి, వాయనాలు, తాంబూలాలు, పసుపు కుంకుమలు అందించి, వారి ఆశీస్సులు పొందారు.శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు ఉదయం నుంచి మహిళలతో కిటకిటలాడాయి. తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి, శ్రీకనకదుర్గమ్మ, మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. రాజ్యలక్ష్మీ దేవి ఆలయంలో అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు.



నిడదవోలులోని సంగాలమ్మ ఆలయంలో మహిళల పూజలు

ఉండ్రాజవరం: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా పాలంగి గ్రామంలోని కనకదుర్గమ్మ వారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ అర్చకుడు సాయి వికాసన, గౌతమ్ చక్రవర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.అమ్మవారిని సుమారు రూ .12 లక్షల కరెన్సీ నోట్లతో అలకరించారు. తణుకు, ఉండ్రాజవరం మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి దంపతులు, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలిచేటి జానకిరామయ్య, దొడ్డా సూర్యనారాయణ, బొక్క శివకుమార్, కేతా సత్యనారాయణ, టేకి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పాలంగి, మోర్త, ఉండ్రాజవరం, కె.సావరం, చివటం తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి, తీపర్రు, కాకరపర్రు, కానూరు గ్రామాల్లోని కనకదుర్గమ్మ వారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు పూజలు నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం రోడ్డులోని కనకదుర్గమ్మ, లలితాంబికా అమ్మవారి, చిట్యాలలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు.

కనకదుర్గమ్మకు మంత్రి వనిత పూజలు

చాగల్లు: చాగల్లు వల్లికుంటలోని కనకదుర్గమ్మ వారికి హోం మంత్రి తానేటి వనిత విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం పక్కనే కొత్తగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మంత్రి సందర్శించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీలు జుజ్జువరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, మాజీ సర్పంచ్ గంద్రోతు సురేంద్ర కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి పాల్గొన్నారు. చాగల్లులోని ధనలక్ష్మమ్మ, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



చాగల్లులో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న మంత్రి తానేటి వనిత

వివక్ష లేకుండా అర్హులకు సంక్షేమం

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ..

చాగల్లు: కులమతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 126వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె చాగల్లు- 1 సచివాలయం పరిధిలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా పలకరించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాన్ని లెక్కలతో సహా ఆమె కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అధికారం చేపట్టినప్పటి నుంచి జగనన్న ఇచ్చిన హామీలను అమలు చేయడమే గాకుండా, కొత్త పథకాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అందుకే ప్రజలందరూ ముఖ్యమంత్రికి నీరాజనం పడుతున్నారన్నారు. ప్రజల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి తానేటి వనిత ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జువరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, మండలశాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, సొసైటీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత

టీడీపీ అగ్ర నేతలపై పోలీసులకు ఫిర్యాదు

నల్లజర్ల: రాష్ట్రంలో శాంతి భద్రలతకు విఘాతం కలిగేలా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోందంటూ వైఎస్సార్ సీపీ నల్లజర్ల సోషల్ మీడియా ప్రతినిధులు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ శ్రేణుల్లో 2019 నుంచి 2024 వరకూ ఎవరి మీద ఎక్కువ పోలీసు కేసులు ఉన్నాయో వారికే భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు ఇస్తామని లోకేష్ పాదయాత్రలో ప్రకటించారని గుర్తు చేశారు. అంతేగాకుండా తంబళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల, నూజివీడు మండలం తుక్కలూరులలో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఆ పార్టీ నాయకులు వ్యవహరించారన్నారు. అదీగాక నాలుగు రోజుల్లో లోకేష్ పాదయాత్ర నల్లజర్ల చేరుకుంటోందని వారు తెలిపారు. ఈ క్రమంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అచ్చంనాయుడులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సోషల్ మీడియా కన్వీనర్ గొర్రెల సాంబశివ నాయుడు, కన్వీనర్‌లు తేజనాయుడు, ఓలేటి శ్రీను, కుంచే గణేష్, నక్కా పండు, బండి చిట్టి ఉన్నారు.

తొలగించిన ఓట్ల పరిశీలన

గోపాలపురం: సర్వేలో తొలగించిన నియోజకవర్గంలోని ఓటర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీఈఎం రాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలో తొలగించిన 1,067 మంది ఓట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. 2022- 23 సంవత్సరంలో తొలగించిన ఓటరు వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఓటును నిశితంగా పరిశీలించాలన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్ కృష్ణ, వీఆర్వోలు లక్ష్మి, శ్రీను, మురళీకృష్ణ ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలే మీ లక్ష్యం

- సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి
- ఆసుపత్రుల సిబ్బందితో సమీక్ష

నిడదవోలు: ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. నిడదవోలు, గోపాలపురం మండలాల పరిధిలోని ఆసుపత్రుల సిబ్బందితో వైద్య, ఆరోగ్య సేవలు-సామర్థ్యంపై శుక్రవారం ఆయన సమీక్ష జరిపారు. నిడదవోలు కిరణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మాతాశిశు మరణాల నివారణకు క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. నూతన మార్గదర్శకాల ప్రకారం గర్భిణులకు రెండు సార్లు టీఐఎఫ్ఎఫ్ఏ స్కానింగ్ చేయించాలన్నారు. పీహెచ్‌సీలో సుఖ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని వైద్యులకు సూచించారు. అనంతరం నిడదవోలు ప్రభుత్వాసుపత్రులను ఆయన సందర్శించారు. వాటిలో అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమాల్లో డీసీహెచ్ఎస్ ఎం.సనత్‌కుమారి, డీఎంహెచ్ఓ కె.వెంకటేశ్వరరావు, వైద్యులు ఏవీఆర్ఎస్ తాతారావు, చైతన్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నిడదవోలు ప్రభుత్వాసుపత్రి వద్ద వైద్యులతో సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

మంత్రి వనితను కలిసిన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు



హోం శాఖ మంత్రి వనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్

కొవ్వూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కమిటీలో స్థానాలు పొందిన ఆ పార్టీ నాయకులు శుక్రవారం హోం మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన గంద్రోతు సురేంద్రకుమార్, కార్యదర్శిగా నియమితుడైన ముదునూరి సూర్యనారాయణరాజు హోం మంత్రిని కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందన్నారు. పదవులు వచ్చిన వారు మరింత బాధ్యతగా కష్టపడి పనిచేయాలని సూచించారు. మొత్తం 55 మందితో కూడిన తూర్పు గోదావరి జిల్లా కమిటీలో కొవ్వూరు నియోజకవర్గానికి మొత్తం ఏడు పదవులు దక్కాయని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జుట్టా ఏడుకొండలు, పిండి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- సీఎం జగన్ నిడదవోలు పర్యటన విజయవంతం చేయాలి
- ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి
- నిడదవోలు మండల పరిషత్ సమావేశం

నిడదవోలు రూరల్: వివిధ శాఖల నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయిల పనులను సంక్రాంతికి పూర్తి చేసేలా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కాపునేస్తం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసేందుకు ఈనెల 30న నిడదవోలు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకంలో ఇప్పటి వరకు ఎన్ని బోర్లు వేశారని ఉపాధి హామీ ఏపీఓ ఏవీ రామారావును ప్రశ్నించగా ప్రస్తుతం సమాచారం లేదని ఏపీవో బదులిచ్చారు. వివరాలు లేకుండా సమావేశానికి ఎందుకు వచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుశాఖల శాఖల అధికారులు ప్రభుత్వ పథకాల అమలు, నిధులు మంజూరుపై సభ్యులకు వివరించారు. కాగా గోపవరం, కోరుపల్లి, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, పందలపర్రు గ్రామాల కాలనీ గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సభ్యులు ఆమోదం తెలిపారు. వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీడీఓ పి.శామ్యూలు, కార్యాలయ ఏఓ రత్నరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

BOI బ్యాంక్ ఆఫ్ ఇండియా

బంగారు ఆభరణముల బహిరంగ వేలం ప్రకటన

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]

సం/- బ్రాంచ్ మేనేజర్
బ్యాంక్ ఆఫ్ ఇండియా, [illegible] బ్రాంచ్

ఇండియన్ బ్యాంక్
తణుకు బ్రాంచ్
తణుకు, ప॥గో॥జిల్లా, ఆం.ప్ర.

APPENDIX-IV స్వాధీనత ప్రకటన రూల్ 8(1) ప్రకారం
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని నోటీసు (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12)లోని 8వ మరియు 9వ నిబంధనలను అనుసరించి ఇండియన్ బ్యాంక్‌కు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ మా శాఖ యొక్క ఋణగ్రహీత & తనఖాదారు : శ్రీ దొడ్డా ఆదినారాయణ మరియు హామీదారు : శ్రీ దొడ్డా వెంకటేశ్వర రావు, సూర్యాలయం వీధి, తణుకు బ్రాంచ్ వారు నోటీసు ప్రకారం చెల్లించవలసిన బకాయి సొమ్ము రూ.15,70,670/- (అక్షరాలా పదిహేను లక్షల డెబ్బై వేల ఆరు వందల డెబ్బై రూపాయలు మాత్రమే) తదుపరి వడ్డీ ఈ నోటీసు అందిన 60 రోజులలోగా ఇండియన్ బ్యాంక్ వారికి చెల్లించవలసినదిగా తేది. 20.06.2023 న ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

బకాయిసొమ్ము చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టం సెక్షన్ 13(4)తో పాటు రూలు 8 మరియు 9 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని తేది. 21.08.2023న స్వాధీనతలోనికి తీసుకోవడమైనదని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా రూ. 15,70,670/- (అక్షరాలా పదిహేను లక్షల డెబ్బై వేల ఆరు వందల డెబ్బై రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులతో సహా ఇండియన్ బ్యాంక్ వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమైనది..

సదరు సర్ఫేసి చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ 8 ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

షెడ్యూలు : భద్రతా ఆసక్తిని సృష్టించిన ఆస్తుల నిర్దిష్ట వివరాలు ఇక్కడ పేర్కొనబడ్డాయి.

స్థిరాస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రేషన్ ఏరియా, తణుకు సబ్-డివిజన్, ఉండ్రాజవరం గ్రామం & మండలం, ఉండ్రాజవరం గ్రామ పంచాయితీ ఏరియా, తొలగించబడిన సమీప డి.నెం.18-47, ఆర్ఎస్ నెం.142/5లో ఉత్తర వైపున ఉన్న 189 1/2 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం నందు ప్రస్తుతం ఆర్‌సిసి భవనము ఉన్నది.

హద్దులు : తూర్పు : ఉండ్రాజవరం కెనాల్ బండ్, దక్షిణం : దొడ్డా వెంకటేశ్వర రావు గారి స్థలం, పడమర : బూరుగుపల్లి వీరన్న గారి స్థలం, ఉత్తరం : బూరుగుపల్లి వీరన్న గారి గోడ. పై హద్దుల మధ్య మొత్తం విస్తీర్ణం 189 1/2 చ॥గ॥లు భూమి అందుగల భవనము యావత్తునకు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

తేది : 21.08.2023
ప్రదేశం : తణుకు

సం/- అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్



